ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి

నోడల్ అధికారి, ఏసీపీ జైపాల్‌రెడ్డి



బౌద్ధనగర్: పోలింగ్ ప్రశాంతంగా ముగిసేందుకు అన్ని విధాలుగా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు చిలకలగూడ ఏసీపీ, నోడల్ అధికారి జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. సోమవారం ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటేసే అవకాశం ఉంటుంది. 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్నవారు మాత్రమే ఓటేస్తారన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద రోడ్లకు ఇరువైపులా వంద మీటర్ల వరకు దుకాణాలు తెరిచేందుకు వీలు లేదన్నారు. నోడల్ అధికారి పరిధిలో మొత్తం 222 పోలింగ్ స్టేషన్లు, 102 భవనాలు ఉన్నాయని, అందులో సమస్యాత్మకంగా ఉన్నవాటిని గుర్తించి ఆయా పోలింగ్‌స్టేషన్ల వద్ద అధిక భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే..

ఓటేసేందుకు వచ్చేవారు గుర్తింపు కార్డులు వెంట తీసుకురావాలని సెల్‌ఫోన్‌లో చూపిస్తే చెల్లదన్నారు. నోడల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో సమస్యాత్మకమైన చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద అధిక బందోబస్తు ఏర్పాటు చేసున్నామన్నారు. పోలింగ్ సందర్భంగా ఏ పార్టీల వారు కూడా ఓటర్లకు డబ్బులు పంచకుండా భారీగా నిఘా పెంచామన్నారు. డబ్బులు, మద్యం పంచుతున్నట్లు సమాచారం అందితే, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈవీఎం మెషిన్లను ఆయా పోలింగ్ స్టేషన్లకు తరలిస్తామన్నారు. ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది సమక్షంలో ఈవీఎంలను వివిధ పోలింగ్ స్టేషన్లు, బూత్‌లకు పంపిస్తామని తెలిపారు.

ఉప ఎన్నిక.. ఎవరో విజేత?

గెలుపుపై ఎవరి ధీమా వారిదే!

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరి ధీమా వారున్నారు. ముక్కోణపు పోటీ సాగుతున్న కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గెలుపు కోసం ప్రచారం చేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఆమె సోదరి నివేదిత బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్నారు. గత రెండు పర్యాయాలు బీజేపీ నుంచి పోటీ చేసిన శ్రీగణేశ్ ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. మాజీ మంత్రి సదా లక్ష్మి కుమారుడు డాక్టర్ వంశ తిలక్‌కు బీజేపీ టికెట్ కేటాయించింది. – కంటోన్మెంట్

ఒక్క అవకాశం ఇవ్వండి..



కంటోన్మెంట్ అభివృద్ధే లక్ష్యంగా తాను పదిహేనేళ్లుగా ప్రజల మధ్యే ఉంటూ ప్రయత్నాలు చేస్తున్నాను. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వల్లే నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుంది. రక్షణ, ఎయిర్‌పోర్టు భూముల్లో నివసిస్తున్న సుమారు 40వేల మందికి పట్టాలు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. కంటోన్మెంట్‌లో మాఫియాలా ఏర్పడిన బోర్డు మాజీ నేతల చట్రం నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత నాపై ఉంది.
– ఎస్. శ్రీగణేశ్, కాంగ్రెస్

నాన్న ఆశీస్సులే గెలిపిస్తాయి..



30 ఏళ్లుగా తన తండ్రి కంటోన్మెంట్‌కు చేసిన సేవలే తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తాయి. నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా ఆయన చేసిన అభివృద్ధే కనిపిస్తుంది అన్నారు. ప్రచారంలో ప్రతి బస్తీ, కాలనీలో ప్రజలు ఇదే విషయం తనకు చెబుతున్నారు. చెల్లి లాస్య నందిత ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోపే మరణించడం పట్ల ప్రజలు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. నాన్నా, చెల్లి చేపట్టిన అభివృద్ధిని కొనసాగించేందుకు తన జీవితాన్ని నియోజకవర్గ ప్రజలకు అంకితం చేస్తా. – నివేదిత, బీఆర్‌ఎస్

బీజేపీతోనే అభివృద్ధి..



మెజారిటీ ప్రాంతం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండే కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యం. కాంగ్రెస్ పార్టీ అవినీతి సొమ్ముతో గెలవాలని చూస్తోంది. విజ్ఞత కలిగిన కంటోన్మెంట్ ఓటర్లు బీజేపీ అభ్యర్థిగా తననే గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారం ఆలస్యంగా ప్రారంభించినప్పటికీ, ప్రజల నుంచి అద్భుత స్పందన లభించింది. అభివృద్ధికే ప్రజలు ఓటేసి గెలిపించాలి. – వంశ తిలక్

సీసీ కెమెరాల ఏర్పాట్లు పూర్తి

సికింద్రాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. తాజాగా సీసీ కెమెరాలను బిగింపు ప్రక్రియ పూర్తి చేశారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి ప్రవేశించడం మొదలు, తిరిగి బయటకు వెళ్లే వరకు ప్రతీ కదలికను రికార్డు అయ్యేలా కెమెరాలు బిగించినట్టు సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంతకేశవ్ పాటిల్ తెలిపారు. సీసీ కెమెరాల వీడియో ఫుటేజీలను ఓయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కంట్రోల్ రూం నుంచి వీక్షించే ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.



సీసీ కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

దేశ భవిష్యత్‌కు అందరూ ఓటేయాలి

సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి



లాలాపేట: భారతదేశ భవిష్యత్ కోసం విద్యావంతులు, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒకరూ తప్పకుండా ఓటేయాలని సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తార్నాకలోని ఏబీవీపీ కార్యాలయంలో జరిగిన కాలనీ అసోసియేషన్ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో దేశంలో సుస్థిరమైన బీజేపీ ప్రభుత్వం ద్వారా తీవ్రవాదం, ఉగ్రవాదం, ఆర్థిక సంక్షోభం, కరోనా, కరప్షన్ వంటి వాటి నుంచి మెరుగైన ఫలితాలను సాధించామన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినట్లు వివరించారు. ప్రజలందరూ రాజకీయాలకు అతీతంగా మోదీ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బండా కార్తీక చంద్రారెడ్డి, మోహన్ రావు, రామ్మోహన్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపునకు పూజలు..

సనత్‌నగర్: సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలవాలని ఆ పార్టీ నేత వెల్లాల రామ్మోహన్ శనివారం సనత్‌నగర్ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వాస్ విష్ణు సహస్రనామ పారాయణం సంస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటింటికి బొట్టు..

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్‌లో శనివారం కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి బొట్టు కార్యక్రమంలో కావ్యాకిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని ఈ బొట్టు కార్యక్రమానికి వస్తున్న స్పందన చూస్తే కిషన్ రెడ్డి గెలుపు ఖాయమనిపిస్తుందన్నారు.

- బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూఅశోక్‌నగర్, పుల్లయ్యబావి,అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్, మేకల సారంగపాణి, హనుమంతు ముదిరాజ్, మేకల హర్ష పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్‌లో శనివారం బీజేపీ నాయకులు కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణితో పాటు పలువురు నాయకులు పాదయాత్ర చేస్తూ బీజేపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంపిణీ చేశారు.

'దానం'కు మద్దతుగా ప్రచారం

అడ్డగుట్ట: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని శనివారం అడ్డగుట్ట, తుకారాంగేట్, శాంతినగర్‌లో ప్రచారం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తుందని, ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. అదే విధంగా కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావాలంటే ప్రజలందరూ హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆదం సంతోష్‌కుమార్ కోరారు. ప్రచారంలో నాయకులు విక్కురి పోచయ్య, వెంకటేష్, గణేష్ యాదవ్, నయీమ్ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ బైక్ ర్యాలీ..

లాలాపేట: లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆఖరి రోజు శనివారం సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాలాపేట ఇసుకబాయి వద్ద ప్రారంభమైన బైక్ ర్యాలీలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి స్వయంగా ద్విచక్ర వాహనంపై శాంతినగర్, తార్నాక, మాణికేశ్వర్‌నగర్, ఓయూ క్యాంప్ బస్తీలు, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, రామ్‌లాల్, సురేష్‌లాల్, లల్లు ముదిరాజ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న శ్రీలతా శోభన్‌రెడ్డి

'విలీనంపై తప్పుడు ప్రచారం'

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో విలీన అంశంపై తమ పార్టీ వైఖరిపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎస్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే కలిగే ప్రయోజనాలు, నష్టాలపై తమ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు కేంద్రానికి లేఖ రూపంలో తన అభిప్రాయాలు తెలియజేయడం జరిగిందన్నారు. దానిని సాకుగా చూపుతూ రాజకీయాలకు సంబంధం లేని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు అసత్య ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజకీయాలు మానుకోవాలని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి మద్దతు ఇచ్చే ఇలాంటి సంస్థ ప్రతినిధులు చేసే ప్రచారాన్ని తాము తిప్పికొడతామన్నారు. గత మూడేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా రామకృష్ణ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.



మాట్లాడుతున్న బీఎస్ శ్రీనివాస్

అభివృద్ధిలో కాంగ్రెస్ నిర్లక్ష్యం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: అభివృద్ధి పనులు చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన సనత్‌నగర్‌లోని కేఎల్‌ఎన్‌వై పార్కులో పర్యటించి వాకర్స్, యోగా శిక్షకులను కలిసి కారుగుర్తుపై ఓటు వేసి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి పనులు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు దాటుతున్నా ఇంత వరకు పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తుందని, ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సరైన పాలన లేక ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మంచినీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకసారి ఎంపీగా గెలిచి కేంద్రమంత్రి అయినా కిషన్‌రెడ్డి తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రచారంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, భోగి బాలరాజ్, ఖలీల్, రాజేష్‌ముదిరాజ్, ఆకుల రాజు, యోగా గురువు కృష్ణ, శ్రీకాంత్, షాబాద్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ..

అడ్డగుట్ట: బీఆర్‌ఎస్ పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా అడ్డగుట్ట డివిజన్‌లో కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, కొండారెడ్డి నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, గోల్ బావి, సాయి నగర్ పరిసర ప్రాంతాల్లో బస్తీబస్తీ తిరుగుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ర్యాలీలో లింగాని శ్రీను, నక్క మధు, సత్తయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మనోహర్, ఎల్లయ్య, పాన్నాల రాజు, అమర్, వసంత, మహ్మద్, నర్సింగ్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

ఆర్.కృష్ణయ్యకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యసభ సభ్యులు బీసీ సంఘం జాతీయ నాయకులు కృష్ణయ్యకు భద్రత కల్పించాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆర్.కృష్ణయ్యపై దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆర్.కృష్ణయ్యకు సెక్యూరిటీని పెంచాలన్నారు. దాడి వెనుక ఉన్న కుట్రదారులను గుర్తించి అరెస్ట్ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నరసింహగౌడ్, రాందేవ్, ప్రీతం, సాయి, దివ్య, నంగీత, శేఖర్, వినయ్, వంశీ, ప్రదీప్, హరీష్ పాల్గొన్నారు.

ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతాం

ఉస్మానియా యూనివర్సిటీ: లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఎస్సీల నడుమ రిజర్వేషన్ల వర్గీకరణ చిచ్చును లేపిన బీజేపీకి ఓటుతో బుద్ధి చెబుతామని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలోకి రాలేమని ముందుగానే తెలుసుకున్న బీజేపీ నేతలు అనేక కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. కుల, మతాల పేరుతో ప్రజలను విడదీస్తూ స్వేచ్ఛను హరిస్తూ దేశాన్ని మధ్యయుగం రాజుల పాలన దిశగా అడుగులు వేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని ఓడించాలని పిలుపునిచ్చారు.



మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునితా మహేందర్‌రెడ్డి వెస్ట్‌మారెడ్‌పల్లిలోని మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం నాయకులను కలిశారు. తన గెలుపునకు ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరారు. ఆమె వెంట పీసీసీ సెక్రటరీ అయూబ్ ఖాన్, సీనియర్ నేత సంజీవ రెడ్డి, ముస్తాక్ మలిక్, ఒమర్ ఖురేషి ఉన్నారు. – సాక్షి, సిటీబ్యూరో

మాజీ గవర్నర్ పూజలు

రాంగోపాల్‌పేట్: నగర పర్యటనలో ఉన్న మాజీ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ శనివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నేడు నర్సులకు సత్కారం

అడ్డగుట్ట: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లాలాగూడలోని రైల్వే ఆస్పత్రిలో ఆదివారం పలువురు నర్సులను సత్కరించనున్నట్లు చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్ రేణుక ఓ ప్రకటనలో తెలిపారు. కరోనా వంటి విపత్కర సమయాల్లో సైతం ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందించిన నర్సులందరికీ అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

దుగ్గు దుగ్గు ప్రచారం.. విజయంతో దూసుకెళ్తాం



కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శనివారం నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆమె బుల్లెట్ నడిపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రావుల శ్రీధర్ రెడ్డి, జక్కుల మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. – రసూల్‌పురా



సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పద్మారావుగౌడ్‌కు మద్దతుగా శనివారం సుమారు నాలుగు వేల బైక్‌లతో తలసాని ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని షెనై గ్రౌండ్ వద్ద పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు.ఇరువురు బుల్లెట్‌పై ప్రచారం చేశారు. –సనత్‌నగర్